




భూముల రీ సర్వే పరిశీలన

ప్రజాశక్తి -పొదలకూరు

మండలం ఊసపల్లి గ్రామంలో మంగళవారం భూముల రీ సర్వే కి సంబంధించి రాళ్లు నాటే కార్యక్రమాన్ని జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ సర్వేలో సర్వే రాళ్లు నాటే కార్యక్రమానికి రంగ్రాలు చేయుటకు ఆగ్రహం త్వరలో అంద జేస్తామన్నారు. హనుమాన్ ప్రసాద్, ఆర్. శ్రీరామ్ మూర్తి, కిషోర్ పొదం కూరు మండల సర్వేయర్ లాలి వెంకటేశ్వర్లు, విలేజ్ సర్వేయర్ రైతుస్ పాల్గొన్నారు.



భూముల సర్వేను పరిశీలిస్తున్న జెసి

నెల్లూరు పెద్దారెడ్ల పెను 'తుపాన్'..!

◆వైసిపిని చెడుగుడు ఆడుతోన్న ఎంఎల్ఎలు
◆రెబల్ నేతలకు పార్టీ చెక్
◆రాజకీయ కుటుంబాల్లో కుంపటి

నెల్లూరు రాజకీయాలకు పెట్టింది పేరు.. రాష్ట్ర రాజకీయాలను ప్రభావితం చేసే నేతలు ఎందరో ఇక్కడ నుంచి వచ్చారు. 30 నుంచి 80 ఏళ్ల రాజకీయ చరిత్ర కలిగిన కుటుంబాలు ఇక్కడ ఉన్నాయి. ఇలాంటి రాజకీయ కుటుంబాల్లో వైసిపి అధిష్టానం కుంపటి రగిల్చింది. నెల్లూరు రాజకీయాలు పేరు చెబితే 'ఆనం' 'నల్లపరెడ్డి' 'నేదురుమల్లి', 'మేకపాటి' పేర్లు గుర్తుకొస్తాయి. మారుతోన్న రాజకీయ పరిణామాల క్రమంలో అన్యూహ్యంగా మారింది. ఇటీవల వెంకటగిరి ఎంఎల్ఎ ఆనం రామనారాయణరెడ్డి, ఇతర ముగ్గురు ఎంఎల్ఎలు వైసిపిని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చెడుగుడు ఆడుకుంటున్నారు. విమర్శలతో ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. పార్టీని వీడిన ఎంఎల్ఎలను వైసిపి అదే స్థాయిలో కట్టడి చేస్తుంది. అధికార బలాన్ని ఉపయోగించి ఇబ్బందులు పెట్టేందుకు ప్రయత్నాలు చేస్తుంది. ప్రస్తుతం రాష్ట్ర రాజకీయం నెల్లూరు చుట్టూ తిరుగుతోంది. నెల్లూరు పెద్దారెడ్ల కుటుంబాలు రాజకీయ పెను తుపాన్‌ను సృష్టిస్తున్నాయి. రానున్న రోజుల్లో మరింత వేగం కానున్నాయి..

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

సింహపురి రాజకీయం ఎపిని కంగారు పెడుతోంది. అసలు ఏం జరుగుతుంది. భవిష్యత్తులో ఏం జరుగుతుందోననే పరిస్థితుల్లో అందరూ నెల్లూరు వైపు చూస్తున్నారు. ప్రతి రోజూ మీడియా కథనాలతో ప్రజల్లో అయోమయం నెలకొంది. నెల్లూరు అంటే ఆనం చెంచుసుబ్బారెడ్డి, వెంకటరెడ్డి, అటు తరువాత నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నేదురుల్లి జనార్ధన్‌రెడ్డి, మేకపాటి రాజమోహన్‌రెడ్డి ఈ రాజకీయ కుటుంబాలు రాష్ట్ర రాజకీయాల్లో కీలకంగా వ్యవహ రించాయి. నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా పని చేయగా, ఇతరులు మంత్రులుగా ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. రాజకీయ నాడి తెలిసిన నేతలు ఇక్కడే ఉన్నారు. ఏ పార్టీ అధికారంలోకి వస్తుందో ఆ పరిస్థితులు గమనించి అక్కడ చేరి పోవడం పరిపాటిగా వస్తుంది. ఇటీవల వైసిపి అధి.కారంలోకి వచ్చాక నెల్లూరు పెద్దారెడ్ల కుటుం బాలు ఆపార్టీ వెనుక చేరాయి. 2019 ఎన్నికల్లో ఆ ప్రభావంతో రెండు ఎంపి, పది ఎంఎల్ఎ, జెడ్‌పి ఛైర్మన్, మేయర్, ఎంపిపి, జెడ్‌పిటిసిలు అందరూ వైసిపి పక్షాన చేరారు. 2024 ఎన్నికలను అంచనా వేసిన ఈ కుటుంబాలు తమ సర్దుబాట్లు చేసు కుంటున్నాయి. దాదాపు అన్ని రాజకీయ కుటుంబాల్లో ఆందోళనలు నెలకొన్నాయి. ఆనం కుటుంబానికి 80 సంవత్సరాల చరిత్ర ఉంది.

అందరూ ఒకే మాటపై ఉన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చాక వీరి దారి వారిది అన్నట్లు ఉన్నారు. ఆనం రామనారాయణరెడ్డి వైసిపిని వీడారు. ఆయనకు ధీటుగా ఆ కుటుంబం నుంచి ఆనం విజయకుమార్‌రెడ్డిని వైసిపి ఆయనపై ప్రయోగిస్తుంది. వెంకటగిరి నుంచి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి కుమారుడు రామ్ కుమార్‌రెడ్డిని ఆనంకు వ్యతిరేకంగా తయారు చేస్తున్నారు. ఉదయగిరి ఎంఎల్ఎ మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డిని వైసిపి పక్కన పెట్టింది. ఆ కుటుంబం మధ్య ఇప్పుడు రాజకీయ అగ్గి రాజుకుంది. మేకపాటి రాజమోహన్‌రెడ్డి, విక్రమ్‌రెడ్డి చంద్రశేఖర్‌రెడ్డికి వ్యతిరేకంగా వైసిపి వాడుకుంటుంది. 2024 ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని నెల్లూరు రూరల్, ఉదయగిరి, వెంకటగిరి ఎంఎల్ఎలు వైసిపిని వీడారు. నిన్న మొన్నటి వరకు వైసిపిని బుజానెత్తుకొని జగన్‌మోహన్‌రెడ్డి వీరుడు, సూరుడు అన్న నేతలు ఇప్పుడు ఆయనపై అగ్గిమీద గుగ్గిలమవుతున్నారు. అందరు నేతలు విమర్శల దాడి చేస్తున్నారు. వైసిపిలో జరుగుతోన్న అవినీతి, అక్రమాలను, బయట పెడుతున్నారు. వైసిపిని, జగన్‌ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. ఆపార్టీ పరువును తీస్తున్నారు. వైసిపి నేతలు దీని నుంచి బయటపడడానికి రెబల్ ఎంఎల్ఎలపై ఉక్కుపాదం మోపుతోంది. ముగ్గురు ఎంఎల్ఎలకు ఏ పనిచేయొద్దని, అవసరమైతే కేసులు పెట్టి అరెస్ట్ చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. ముగ్గురు ఎంఎల్ఎలను గుక్కతిప్పు కోకుండా రాజకీయంగా దెబ్బతీస్తున్నారు. ఎంఎల్ఎలు అదే స్థాయిలో వైసిపిని ఎండగడుతున్నారు. వైసిపి బలమైన జిల్లాగా పేరున్న నెల్లూరులో ఈ పరిణామాలు రాజకీయాల్లో మార్పు తీసుకొస్తాయని తెలుస్తోంది.కొందరు వైసిపి ప్రజా ప్రతినిధులు టిడిపి వైపు చూస్తున్నారు. వీరంతా రాత్రికి రాత్రి జెండాలు మార్చే బాపతి. ఏ పార్టీ అధికారంలోకి వస్తుందని తెలిసే ఆపార్టీలోకి మారే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అందరూ జిల్లాలోని వైసిపి ఎంఎల్ఎల వైపు చూస్తున్నారు. కావలి, గూడూరు ఎంఎల్ఎలకు వచ్చే ఎన్నికల్లో టికెట్ లేదనే ప్రచారం సాగుతోంది. కొందరు కోవూరు ఎంఎల్ఎ నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిపై ప్రచారం మొదలు పెట్టారు. ఆయన టిడిపిలో చేరుతారని విష ప్రచారం చేస్తున్నారు. దీనిని ప్రసన్న తీవ్రంగా ఖండించారు. వాస్తవంగా నల్లపరెడ్డికు జిల్లాకు ప్రత్యేక రాజకీయ చరిత్ర ఉంది. ప్రసన్నకుమార్‌రెడ్డి మంత్రిగాను పనిచేశారు. వైసిపిలో చేరాక ఆయన రాజకీయ, ఆర్థికంగా బలపడ్డారనే ప్రచారం సాగుతోంది. నియోజకవర్గంలో అనేక పనులకు ముఖ్యమంత్రి భారీగా నిధులు మంజూరు చేశారు. ప్రస్తుతం పనులు జరుగుతున్నాయి. ఇది కాకుండా మాజీ మంత్రి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి పేరును పెన్నా బ్యారేజ్‌కి పెట్టడంతోపాటు, ప్రసన్నకుమార్‌రెడ్డికి జగన్ ప్రత్యేక గౌరవం ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఇలాంటి సమయంలో వచ్చే ఎన్నికల్లో వైసిపి అధికారంలోకి వచ్చినా, రాకపోయినా జగన్ వెంటే ఉంటారని తెలుస్తోంది. ఇదే విషయాన్ని ఆయన స్పష్టం చేశారు. ప్రధానమైన రాజకీయ కుటుంబాలు ఇప్పుడు తడబడుతున్నాయి. నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి కుమారులు మాత్రమే రాకీయంగా వెనుక పడ్డారు. జనార్ధన్‌రెడ్డితోనే ఆ కుంటుంబ హవా తగ్గిపోయింది. కేవలం ఎవరూ లేని చోట ఏదో అవకాశం ఇచ్చినట్లు ఉంది పరిస్థితి. 2024 ఎన్నికల్లో నెల్లూరు పెద్దారెడ్ల రాజకీయ వ్యూహంలో ఎవరి పరిస్థితి ఏమిటో అర్థం కాని పరిస్థితులు కనిపిస్తున్నాయి. రాష్ట్రంలోని ప్రజలందరి దృష్టి నెల్లూరు వైపు ఉంది. ఏం జరుగుతుందో చూడాలి. రానున్న రోజుల్లో మరింత రాజకీయ మార్పులు ఉండేలా కనిపిస్తున్నాయి.



ఆనం రామనారాయణరెడ్డి



కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి



మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి



నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి



నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి

జిల్లా అభివృద్ధిలో బ్యాంకర్ల భాగస్వామ్యం

కలెక్టర్ చక్రధర్‌బాబు

ప్రజాశక్తి-నెల్లూరు

ప్రభుత్వ ప్రాధాన్యత రంగాలకు విరివిగా రుణాలు మంజూరు చేసి, జిల్లా అభివృద్ధిలో బ్యాంకర్లు భాగస్వామ్యం కావాలని కలెక్టర్ కెవిఎన్ చక్రధర్ బాబు పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ లోని తిక్కన ప్రాంగణంలో జిల్లా లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో జిల్లా సంప్రదింపుల కమిటీ (డి.సి.సి), జిల్లా స్థాయి సమీక్ష కలెక్టర్ చక్రధర్ బాబు అధ్యక్షతన నిర్వహించారు. తొలుత లీడ్ బ్యాంక్ డిస్ట్రిక్ట్ మేనేజర్ శ్రీకాంత్ ప్రదీప్ కుమార్, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా బ్యాంకుల కార్యకలాపాలని వివరించారు. జిల్లాలో వివిధ బ్యాంకులకు సంబంధించి మొత్తం 385 బ్యాంకు బ్రాంచ్‌లు పనిచేస్తున్నాయన్నారు. గ్రామీణ ప్రాంతంలో 144 బ్రాంచ్‌లు, సెమీ అర్బన్ ప్రాంతంలో 102, అర్బన్ ప్రాంతంలో 139 బ్యాంకు బ్రాంచ్‌లు పనిచేస్తున్నాయన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలకు సంబంధించి, ఆయా బ్యాంకుల వారీగా, బ్రాంచ్‌ల వారీగా నిర్దేశించిన లక్ష్యాలను, సాధించిన ప్రగతిని వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నవరత్నాలు– పేదలందరికీ ఇల్లు పథకంలో బ్యాంకులు తప్పనిసరిగా భాగస్వాములై ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించడంలో సహకారం అందించాలన్నారు. ఆర్.బి.ఐ ఏజిఎం హనుమ కుమారి, నాబార్డు డిడిఎం రవి సింగ్, మెప్మా పిడి రవీంద్ర బాబు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్ రాజు, మత్స్య, పశుసంవర్ధక శాఖ శాఖ జేడిలు నాగేశ్వరరావు, మహేశ్వరుడు, జిల్లా ఉద్యాన శాఖాధికారి సుబ్బారెడ్డి, ఏపీ ఎం ఐ పి పిడి శ్రీనివాసరావు, ఎన్డిసిసి బ్యాంకు సిఇఒ శంకర బాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ చక్రధర్‌బాబు

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా

ప్రజాశక్తి-నెల్లూరు

నగరపాలక సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగ, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) డిమాండ్ చేసింది. మంగళవారం నగరపాలక సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు , కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు)ఆధ్వర్యంలో కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా, నిరసన చేపట్టారు. అనంతరం కార్పొరేషన్ మేనేజర్ ఇనాయతుల్లాను యూనియన్ నాయకులు కలిసి సమస్యలను వివరించారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. అనంతరం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు కత్తి శ్రీనివాసులు మీడియాతో మాట్లాడారు. నగర పాలక సంస్థలో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మున్సిపల్ కార్మిక చట్ట ప్రకారం అమలు కావాల్సిన క్యాజువల్, పండుగ సెలవులు, మెటర్నటీ లీవులు అమలు కావడం లేదన్నారు. ఉద్యోగుల, కార్మికుల జీతాల నుంచి ప్రావిడెంట్ ఫండ్, ఈఎస్ఐ పేరుతో డబ్బులు పట్టుకోవడం జరుగుతుందన్నారు. బెనిఫిట్స్ ఒక్క రూపాయి కూడా కార్మికులకు రావడం లేదన్నారు. గత గత ప్రభుత్వ హయాంలో విధుల్లో చనిపోయిన కార్మికుడికి రూ.10 లక్షల ఎక్స్ర్గేషియాగా మృతుల కుటుంబాలకు అందజేశారని, వైసిపి ప్రభుత్వం వచ్చాక గడిచిన మూడేళ్లలో కాలంలో 9 మంది కార్మికులు విధులు నిర్వహిస్తూ చనిపోతే ఒక్క రూపాయి కూడా చెల్లించలేదన్నారు. చనిపోయిన కార్మికుల స్థానాలలో వారి వారసులకు ఇవ్వాల్సిన ఉద్యోగాల కోసం ఏళ్లతరబడి కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటున్నారన్నారు. పారిశుధ్య కార్మికులకు ఇవ్వాల్సిన దుస్తులు, చెప్పులు,సబ్బులు, నూనెలు, గ్లౌజులు కూడా ఇవ్వలేదన్నారు. మున్సిపల్ కార్మికులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అన్ని విభాగాల కార్మికులకి హెల్త్ అలవెన్స్ వర్తింప చేయాలన్నారు. నగరపాలక సంస్థలో పనిచేయుచున్న ఉద్యోగులు కార్మికుల శ్రమ వల్లే రూ. కోట్లలో పన్నులు కార్పొరేషన్ ఖజానాకు చేరుతున్నాయన్నారు. ఇప్పటికైనా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని లేనిపక్షంలో ఆందోళన ఉదతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎం అశోక్, వజ్రమ్మ, సునీల్, మారుతి, దేశ మూర్తి, కామాక్షమ్మ, లోకేష్,చెన్నయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న మున్సిపల్ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు

అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-నెల్లూరు

పర్యావరణ సమతుల్యత మహిళల ఆరోగ్య సంరక్షణ గ్రామీణ అభివద్ధికి లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎప్పుడూ ప్రధాన భూమిక పోషిస్తుందని ఎస్‌బిఐ బ్యాంకు అమరావతి సర్కిల్ ఛీప్ మేనేజర్ నవీన్ చంద్రజ పేర్కొన్నారు. మంగళవారం గొల్లపల్లి అంగన్‌వాడీ కేంద్ర ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సుమారుగా 38 అంగన్‌వాడీ కేంద్రాలల్లో ఆర్వో ప్లాంట్లు ట్యూబులు, స్మార్ట్ టీవీలు వస్తువులను అందజేయడంతోపాటు పలు అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నామన్నారు. సామాజిక బాధ్యతలో భాగంగా ఈ ఏడాది విస్తృత స్థాయిలో సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా ఈ ఏడాది ఏపిలో రూ 38 లక్షలతో 34 అంగన్వాడీ కేంద్రాలకు ఆర్ఓ ప్లాంట్లు,స్మార్ట్, టీవీలు, ట్యాబ్ లు పంపిణీకి శ్రీకారం చుట్టామన్నారు. ఈ కబ్యాంకు రీజినల్ అడ్మినిస్ట్రేషన్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వరదరాజన్, నెల్లూరు రీజినల్ మేనేజర్లు శ్రీనివాస్ రావు, లక్ష్మీ, శేషగిరిరావులు సహా పలువురు అధికారులు పాల్గొన్నారు.

వడదెబ్బతో మాజీ సర్పంచ్
నాగూర్ సాహెబ్ మృతి

ప్రజాశక్తి-సీతారామపురం : మండలంలోని బసినేని పల్లి పంచాయతీ సిపిఎం మాజీ సర్పంచ్, ఎంపిటిసి మెంబరు అగ్గి గుండాల నాగూరు సాహెబ్ (69) మంగళవారం వడదెబ్బతో మృతిచెందారు. ప్రస్తుతం రైతు సంఘం డివిజన్ నాయకులుగా ఉన్నారు. వివరాలమేరకు.. పొలానికి నీళ్ల కడుతున్న సమ యంలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున వడదెబ్బ తగిలి కింద పడ్డాడు. దీంతో చుట్టు పక్కల పొలంలోని వారు వచ్చేలోపు చనిపోయి ఉన్నాడని స్థానికులు తెలిపారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. ఆయన మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

సిపిఎం సంతాపం: నాగుర్‌సాహెబ్ మృతి పార్టీకి తీరనిలోటని సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ అన్నారు.నాగుర్‌సాహెబ్ పార్టీలో చురుగ్గా పనిచేసేవారని కొనియాడారు. పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరం తరం పోరాటం చేసేవారని తెలిపారు. మృతుని కుటుంబానికి సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, జిల్లా కార్యదర్శివర్గసభ్యులు మాదాల వెంకటేశ్వర్లు, ఎం.మోహన్‌రావు, జొన్నలగడ్డ వెంకమరాజు, గోగుల శ్రీనివాసులు, తుళ్లూరు గోపాల్, కె.అజయ్‌కుమార్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలెవెంగయ్య, అధ్యక్షులు పులిగండ్ల శ్రీరాములు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చంద్ర రాజగోపాల్, ఉదయగిరి రైతు సంఘం నాయకులు కాకువెంకటయ్య, కోడే రమణయ్య, తదితరులు వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.నేడు ఉదయం 11 గంటలకు అంత్యక్రియలు జరుగునని కుటుంబ సభ్యులు తెలిపారు.





నాగూర్‌సాహెబ్ భౌతికకాయం ఇన్‌సెట్లో నాగూర్ సాహెబ్ (ఫైల్)

విద్యార్థులకు పెన్నులు పంపిణీ

ప్రజాశక్తి -కందుకూరు : మాచవరం జడ్‌పిహెచ్ఎస్ హైస్కూల్లో 10 తరగతి విద్యార్థుల విడ్కోలు కార్యక్రమం మంగళవారం జరిగింది. 66 మంది విద్యార్థులకు ప్యాడ్‌లు, పెన్నులు ఆ గ్రామ ఉపాధ్యా యులు కె కష్ణారెడ్డి దాదాపు రూ.7000లు విలువ కలిగిన వస్తువులు పంపిణి చేశారు. కార్యక్రమంలో స్కూల్ హెడ్మాస్టర్, ఎంఇఒ, ఎంపిటిసి కృష్ణీపాటీ శ్రీనివాసులు రెడ్డి, సర్పంచ్, స్కూల్ కమిటీ ఛైర్మెన్ శ్రీనివాసులు రెడ్డి, ఉపాధ్యా యులు, విద్యార్థులు పాల్గొన్నారు. రాష్ట్రంలో టాప్ 10 నిలిచినవారికి నగదు బహు మతులు అందజేస్తానని కష్ణారెడ్డి ప్రకటించారు.

1న మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-వలేటివారిపాలెం : మండల సర్వసభ్య సమావేశం ఎంపిడిఒ కార్యాలయంలోని సమావేశపు హాలులో ఏప్రిల్ 1న మధ్యాహ్నం 3 గంటలకు ఎంపిపి పొనుగోటి మౌనిక అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ షేక్ రఫీక్‌అహ్మద్ తెలిపారు. జెడ్‌పిటిసి ఇంటూరి భారతి, ఎంపిటిసిలు, కోఆప్షన్ సభ్యులు, సర్పంచులు హాజరవుతారన్నారు.

'గడప గడపకు మన ప్రభుత్వం'

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : వైసిపి ప్రభుత్వంలో ప్రతి గడపకు సంక్షేమ ఫలా లు అందుతున్నాయని మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కోడూరులో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం జరిగింది. వైసిపి నాయ కులు కావల్ రెడ్డి రం గారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి గోవ ర్ధన్ రెడ్డి పాల్గొన్నారు. చిల్లకూరు సుధీర్ రె డ్డి, కన్వీనర్ ఉప్పల శంకర య్య గౌడ్, ఎంపీపీ స్వర్ణలత, కావల్ రెడ్డి హరిచం ద్రారెడ్డి, ఇసనాక రమేష్ రెడ్డి, దిలీప్ రెడ్డి ఉన్నారు.

మాలకొండారెడ్డి స్ఫూర్తితో
ప్రజా ఉద్యమాలు బలోపేతం : సిపిఎం

ప్రజాశక్తి-నెల్లూరు : సిపిఎం నగర ఉద్యమ నేత, మాజీ కౌన్సిలర్ వి.మాలకొండా రెడ్డి స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయాలని: సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ పిలుపు నిచ్చారు. మంగళవారం మాజీ కౌన్సిలర్ వి.మాలకొండా రెడ్డి 38వ వర్ధంతి సందర్భంగా స్థానిక శెట్టిగుంట రోడ్డు సెంటర్ నుండి బోడిగాడి తోటలోని మాలకొండా రెడ్డి స్మారక స్థూపం వరకు సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన స్థూపానికి పూల మాలలు, పూలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడారు. జిల్లాలో కార్మిక ఉద్యమం నిర్మించడంలో మాలకొండ రెడ్డి ప్రత్యేక పాత్ర పోషించారన్నారు.. లారీ వర్కర్స్ యూనియన్, హమాలీ యూనియన్లు రాష్ట్రంలోని అగ్రగామిగా నడిపి చూపించిన మాస్ లీడర్ గా గుర్తింపు పొందిన వ్యక్తి మాలకొండ రెడ్డి అన్నారు. మాలకొండ రెడ్డి ఆశయాల కోసం ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలన్నారు. సభకు సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు జి నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు.ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, నగర కార్యదర్శి వర్గ సభ్యులు పి చంద్ర రెడ్డి, పి సూర్యనారాయణ నగర కమిటీ సభ్యులు బిపి నరసింహా,కె. చెంగయ్య, మూలం ప్రసాద్, చిరంజీవి, ఏ మేలు,అత్తిమూరి శ్రీనివాసులు, కత్తి పద్మ పాల్గొన్నారు



మాలకొండారెడ్డి స్థూపం వద్ద నివాళి అర్పిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, ఇతర నాయకులు

'కెజిబివి'లో ప్రవేశాలకు
దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-వలేటివారిపాలెం : వలేటివారిపాలెంలోని కస్తూరిభా గాంధీ బాలికా విద్యాలయంలో విద్యార్థుల ప్రవేశం కోసం ఆన్‌లైన్‌లో అడ్మిషన్లు జరుగుతున్నట్లు పాఠశాల ప్రత్యేకాధికారిణి జాగర్లమూడి గోవర్ధని మంగళవారం తెలిపారు. ఆరో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపిసి ఇంగ్లీషు మీడియంలో దరఖాస్తు చేసుకునేందుకు ఉన్నతాధికారులు అవకాశం కల్పించారన్నారు. 6 నుంచి ఇంటర్ వరకు 40 సీట్లు ఖాళీలు ఉన్నట్లు చెప్పారు. ఏడో తరగతికి మూడు, తొమ్మిదో తరగతికి ఒక సీటు మాత్రమే ఖాళీగా ఉంది. ఏప్రిల్ 20వ తేది వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు సమర్పించవచ్చన్నారు. ఆన్‌లైన్ వివరాలు హెచ్‌టిటిపి. ఎపికెజిబివి.ఎపిసిఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌లింకు ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉందన్నారు. సందేహాలు ఉంటే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాఠశాలలో సంప్రదించాలని ఆమె సూచించారు.

పోషకాహారంపై అవగాహన

ప్రజాశక్తి -పొదలకూరు : పంచాయతీ పరిధిలోని లింగంపల్లి తోపు, మండలంలోని అమ్మవారిపాలెం కేంద్రాల్లో పోషన్ పక్వాడ్ కార్యక్రమాన్ని అంగన్వాడీ కార్యకర్తలు చిన్న బుజ్జమ్మ , స్వర్ణలత సూపర్వైజర్లు జ్యోతి లక్ష్మీ, డి.పద్మజ మంగళవారం ఘనంగా నిర్వహించారు. అ బాలింతలకు,తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సునీత, సుగుణమ్మ, ప్రభావతి, జయలక్ష్మి మహిళా పోలీసులు దివ్యవాణి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - వలేటివారిపాలెం : మండలంలోని స్త్రీ శిశు సంక్షేమ శాఖ కు సంబంధించిన అంగన్‌వాడీ సెక్టార్‌లో పోషణ పక్వాడ్ కార్యక్రమం మంగళ వారం జరిగింది. సూపర్‌వైజర్ సునీత మాట్లాడారు. తల్లులు, గర్భవతులకు పోషక పదార్థాల గురించి వివరించారు. గర్భిణులకు పలు సూచనలు చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఆసరా' చెక్కులు పంపిణీ


ప్రజాశక్తి -పొదలకూరు : మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రుణమాఫీ చేస్తానని మహిళలను మోసం చేశాడని మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి విమర్శించారు. పొదలకూరులో మంగళవారం 3వ విడత వైఎస్ఆర్ ఆసరా పథకం మెగా చెక్కు పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మాట్లాడారు. రాష్ట్రంలో తమ ప్రభుత్వం ఆసరా పథకం కింద మూడు విడతల్లో కలిపి 19,180 కోట్ల రూపాయలు పంపిణీ చేసినట్లు చెప్పారు. ఈ మొత్తాన్ని 78 లక్షల 94 వేల169 మహిళలకు అందజేసినట్లు తెలిపారు. మండల ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, వైకాపా నాయకులు పాల్గొన్నారు.



పొదలకూరులో..

ప్రజాశక్తి - లింగసముద్రం

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు పెద్దపీట వేస్తున్నారని ఎంఎల్ఏ మానుగుంట మహీధర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయ ఆవరణంలో ఆసరా వారోత్సవాల సందర్భంగా ఎపిఎం సింహాద్రిరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన 'ఆసరా' 3వ విడత రుణమాఫి 8.47కోట్లు చెక్కును మహిళలకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన హామీలను నెరవేరుస్తు మహిళలకు భరోసా కల్పిస్తుందన్నారు. ఎంపిపి పెన్నా కృష్ణయ్య,వైసిపి మండల కన్వీనర్ పిచ్చపాటి తిరుపతిరెడ్డి,వైసిపి మండల మీడియా అధికార ప్రతినిధి వరికూటి క్రిష్ణారెడ్డి,తహాశీల్ధార్ సుధాకర్,ఎంపిడిఓ శ్యాంబాబు, ఎంపిటిసిలు ,సర్పంచ్‌లు, నాయకుల పాల్గొన్నారు.



లింగసముద్రంలో..

'పది' పరీక్షలకు సమాయత్తం

ఉపాధ్యాయుల ప్రత్యేక పర్యవేక్షణలో విద్యార్థులు

ప్రజాశక్తి-నెల్లూరు

పదో తరగతి పరీక్షల్లో ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల విద్యార్థులు పది పాయింట్లు తెచ్చుకొనేందుకు సమాయత్తం అవుతున్నారు. ఏప్రిల్ 3 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా పదవ తరగతి పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే అన్ని పాఠశాలల్లో సిలబస్ పూర్తి చేసి ప్రత్యేక కోచింగ్ తీసు కుంటున్నారు. గతేడాది ప్రయివేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ, రెసిడెన్షియల్, ఎయిడెడ్ పాఠశాలల్లో మంచి ఫలితాలు వచ్చాయి. జిల్లా వ్యాప్తంగా 450 ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు పది పరీక్షలకు సిద్ధం అవుతున్నారు. ఈ ఏడాది ప్రత్యేక మార్పులతో విద్యార్థులకు ఉపశమనం కలుగనున్నది. 12 పేపర్లను 6 పేపర్లకు కుదించారు. అందుకు అనుగుణంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు తర్ఫీదు ఇస్తున్నారు. ప్రయివేట్ పాఠశాలల్లో పరీక్షా విధానం మారడంతో అందుకు అనుగుణంగా ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నారు. పదికి పది పాయింట్లు సాధించాలంటే ఏలాంటి ప్రణాళిక ఉండాలి, ఏ విధంగా పరీక్ష రాయాలి, సమయాన్ని ఏ విధంగా సద్వినియోగం చేసుకోవాలి వంటి కీలకమైన అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. స్థానిక భక్తవత్సలనగర్ ప్రాంతంలోని కెఎన్ఆర్ మున్సిపల్ పాఠశాల కొన్ని ఏళ్లుగా రాష్ట్రంలోనే ప్రత్యేకత సంతరించుకుంటుంది. ఉత్తమ ర్యాంకులతో, ప్రయివేట్ పాఠశాలలకు ధీటుగా కెఎన్ఎఆర్ ఎదుగుతుంది. ఈ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు సమిష్టి కృషితో ఉత్తమ ఫలితాలు రాబడుతున్నట్లు ప్రధానోపాధ్యాయులు విజయ్‌ప్రకాష్ తెలిపారు. రానున్న పది పరీక్షల్లోనూ ఉత్తమ ఫలితాలే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు.



ఎరోనాటికల్ ఇంజినీర్ కావాలన్నదే లక్ష్యం

పి.నిర్మల్ తేజా,10వ తరగతి

నేను ఒక మధ్యతరగతి కుటుంబానికి చెందిన వాడిని, తన తండ్రి ఫొటో గ్రాఫర్‌గా పని చేస్తున్నారు. 8వ తరగతి నుంచి కెఎన్ఆర్ పాఠశాలలో చదువుతున్నాను. పాఠశాలలో చేరిన నాటి నుంచి ఉపాధ్యాయుల సహకారం ఎంతో బాగుంది. ఏరోనాటికల్ ఇంజినీర్ కావాలన్నదే తన ప్రధాన లక్ష్యం.

డాక్టర్ కావాలన్నదే లక్ష్యం

బి.ఐశ్వర్య, 10వ తరగతి

తాను 10వ తరగతి పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో అత్యధిక మార్కులు సాధించి , ఇంటర్‌లో బైపిసి గ్రూప్‌లో చేరి, ఎంబిబిఎస్ పూర్తి చేసి నిరుపేదలకు వైద్యసేవలందించాలన్నదే తన జీవిత లక్ష్యం. తన తండ్రి ఒక కెమిస్టు కావడం వల్ల వైద్యురాలిగా ప్రజలకు సేవలందించాలన్నదే చిన్ననాటి నుంచి మనస్సులో నాటుకొని ఉన్నది.

సమిష్టి కృషితో ఫలితాలు

విజయ్‌ప్రకాష్, ప్రధానోపాధ్యాయులు- కెఎన్ఆర్ పాఠశాల

కెఎన్ఆర్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులందరి సహకారంతో, సమిష్టి కృషితో కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా తమ స్కూల్ విద్యార్థులు ర్యాం కులను సొంతం చేసుకొని రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందామని హెచ్ఎం విజయ్‌ప్రకాష్ తెలిపారు. ఈ ఏడాది జరగనున్న 10 పరీక్షలకు తమ పాఠశాల నుంచి 356 మంది విద్యార్థులు హాజరవుతున్నారని తెలిపారు. తమ పాఠశాలలో మౌలిక వసతులు కొరత, సిబ్బంది కొరత ఉన్నప్పటికీ వాటిని పట్టించుకోకుండా తమ సహోపాధ్యాయుల సహకారంతో అధనంగా శ్రమించి విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్నామని తెలిపారు.



31 నుంచి అన్నదానం


మాట్లాడుతున్న పరమేశ్వర్‌రెడ్డి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : పట్టణంలోని జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు వచ్చే అవుట్ పేషెంట్లకు 31వ తేదీ నుండి నిరంతరం భోజనం వితరణ కార్యక్రమం ప్రారంభించనున్నట్లు సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు కంచి.పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆత్మకూరు పట్టణంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కంచి పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ తమ స్వగ్రామం ఆత్మకూరు 1987లో ఆత్మకూరు నుండి హైదరాబాదుకు వెళ్లి రకరకాల వ్యాపారాలు చేస్తూ హైదరాబాదులో స్థిరపడ్డామని తెలిపారు. అయితే పుట్టిన ఊరికి ఏదో ఒక సేవా కార్యక్రమం చేయాలన దృఢ సంకల్పంతో ఆ భగవంతుని ఆశీస్సులతో పేదప్రజలు ఎంతోమంది ఆత్మకూరు జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు వచ్చే అవుట్ పేషెంట్లకు నిత్య అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నామన్నారు. ఇటీవల జిల్లా కలెక్టర్ చక్రధర్ బాబును స్థానిక ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డిలను కలిసి చర్చించడంతో వారు ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. 31వ తేదీన ఉదయం 10 గంటలకు ఆత్మకూరు జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో ప్రారంభించనున్న ఈ నిత్య అన్నదానం కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ చక్రధర బాబు ఆత్మకూరు శాసనసభ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డి పాల్గొని ప్రారంభిస్తారని తెలియజేశారు. కార్యక్రమంలో ఆత్మకూరుకు చెందిన విశ్రాంతి ఉపాధ్యాయులు శేషారెడ్డి, నారాయణరెడ్డి, వెంకటరెడ్డి, కిషోర్‌బాబు, హనుమంత్‌రెడ్డి, తదితరులు హాజరయ్యారు.

బాల్ బ్యాడ్మింటన్ జట్లు ఎంపిక

ప్రజాశక్తి-కావలి : స్థానిక డి.బి.ఎస్. ఇంజనీరింగ్ కాలేజీలో మంగళవారం జూనియర్ బాలికల, బాలుర జాతీయ క్రీడలకోసం క్రీడాకారుల జట్లను ఎంపిక చేశారు. ఎంపికైన జట్ల క్రీడాకారులకు యూనిఫారంను బహూకరించారు. మహారాష్ట్రలోని ముర్తిజాపూర్‌లో 30 నుండి ఏప్రిల్ 03వ తేదీ వరకు జరిగే "67వ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ నేషనల్ చాంపియన్ షిప్"లో ఆంధ్రప్రదేశ్ తరఫున పాల్గొనే బాలురు, బాలికల జట్లకు యూనిఫారం అందజేశారు. బాలికలకు శేషగిరి, బాలురకు సతీష్ కుమార్ రెడ్డి, కాంట్రాక్టర్, మనీష్‌కుమార్‌రెడ్డి సాయి స్పోర్ట్స్ తరపున టీ షర్ట్స్ ఇచ్చారు. బాలురకు కోచ్‌గా పి.మురళీ, మేనేజర్ గాయం. శ్రీనివాసులు, బాలికలకు కోచ్‌గా కె.మనీష్‌కుమార్‌రెడ్డి, మేనేజర్‌గా దివ్య వ్యవహరిస్తారు.

సరస్వతి పూజ మహోత్సవం

ప్రజాశక్తి బిట్రగుంట : బోగోలు మండలం పాత బిట్రగుంట గ్రామంలో ఉన్న జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంగాధర్ ఆధ్వర్యంలో సరస్వతి పూజ మహోత్సవ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత బిట్రగుంట పాఠశాలకు రాష్ట్రంలోని మంచి గుర్తింపు ఉందని, ఈ పాఠశాలలో చదివినవారు ఎంతో ఉన్నత స్థాయికి వెళ్లి పాఠశాల అభివృద్ధికి తోడ్పడుతున్నారని, ఆహ్లాదకరమైన వాతావరణంలో ఈ పాఠశాలను దాతల సహకారంతో అభివృద్ధి చేశారని, విద్యార్థులు మంచి విద్యను అభ్యసించి పాఠశాలకు, గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరును తీసుకురావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల ప్రజాపరిషత్ పాఠశాల ప్రధానఉపాధ్యాయులు మద్దులూరి ప్రసాద్‌రావు,పాఠశాల ఉపాధ్యాయులు, అభివృద్ధి కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-సంగం : మండల కేంద్రంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు మాల్యాద్రి మంగళవారం సరస్వతీదేవి పూజను ఘనంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారిని పరిమళ పుష్పాలతో అలంకరించి ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. విద్యార్థులు రాబోయే 10వ తరగతి పబ్లిక్ పరీక్షలలో మంచి ఉత్తీర్ణత సాధించాలన్నారు.

లింగన్నపాలెంలో తాగునీటి కష్టాలు

ప్రజాశక్తి-కొండాపురం : మండలంలోని సచ్చివోలు పంచాయతీ లింగన్నపాలెంలో గత నాలుగు రోజులు రాక ప్రజల అవస్థలు పడుతున్నారు. గ్రామంలో సుమారు 1000మంది పైగా ప్రజలను నివసిస్తున్నారు. వీరికి వాడుకకు తాగేందుకు నాలుగు రోజులుగా నీళ్ల రాకపోవడంతో వాడుకునేందుకు కూడా మినరల్ వాటర్ క్యాన్లను కొనుక్కొని వాడుకుంటున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. ఆర్డబ్ల్యూఎస్ఇకి పంచాయతీ కార్యదర్శి తెలుపగా ఎందుకు రావడం లేదో తెలియదని త్వరలో పరిష్కరిస్తామని చెబుతున్నారన్నారు. ఎప్పుడు వర్షాలు పడ్డ కరెంటు వైర్లు తిరిగి పోయి మోటర్లు పనిచేయక నీళ్ల రావడం లేదని ఎన్నోసార్లు చెప్పిన పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ఉన్నత అధికారులు స్పందించి తమకు తాగునీటి కష్టాలను తీర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పామంజి గోపికి సన్మానం

ప్రజాశక్తి-ఇందుకూరుపేట : మండలంలోని మైపాడు గ్రామానికి చెందిన పామంజి గోపి అనే రైతును మంగళవారం మైపాడు గ్రామంలోని నాయకులు, రైతులు ఘనంగా సన్మానించారు. పామంజి గోపి కి సంబంధించిన మూడు ఎకరాల పొలంలో ఎకరాకు 5.5 పుట్టి లెక్కన దిగుబడి తీసుకురావడంతో మైపాడు గ్రామంలోని రైతులు, నాయకులు గోపిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అగ్రికల్చర్ ఏఈ రఘునాథ్ రెడ్డి విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి రైతు పామంజి గోపిని ఆదర్శంగా తీసుకుని అత్యధికంగా దిగుబడి సాధించాలన్నారు. మండలం రైతులకు ఎప్పుడు యూరియా కొరత రాకుండా చూసుకున్నామన్నారు. మైపాడు సర్పంచ్ సంగం వెంకయ్య, ఎంపిటిసిలు సుబ్రహ్మణ్యం, రమణయ్య, మాజీ ఎంపిటిసి శ్రీహరికోట ప్రసాద్, శివాలయం చైర్మన్ కనుపూరు సురేంద్ర, పామంజి నరసింహ, రైతులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో పోషక విలువలు

ప్రజాశక్తి-అల్లూరు : అతి తక్కువ ఖర్చుతో కూడిన చిరుధాన్యాలతో సమృద్ధిగా ఎన్నో రకాల పోషక విలువలు ఉంటాయని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని చెర్లో సంఘం గిరిజన కాలనీలో పోషన్ పక్వాడ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి బాలింతలు, గర్భిణులు, కిశోర బాలికలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆకుకూరలు, కూరగాయలు, పాలు, పండ్లు అతి తక్కువతో లభించే చిరుధాన్యాల వల్ల ఎంతో ప్రయోజనం ఉంటుందని తెలియజేశారు. వాటిపై అవగాహన లేని కారణంగా అనేక రుగ్మతలను ఎదుర్కొంటున్నామన్నారు. కార్యక్రమంలో భాగంగా ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేందుకు చక్కగా రంగవల్లులు వేసి వాటి వల్ల ఉపయోగాలను తెలియజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కావలి : ఐ.సి.డి.ఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని తుమ్మలపెంట సెక్టార్లో తుమ్మలపెంట గ్రామంలో మంగళవారం పోషణ పక్వాడ్ కార్యక్రమం సూపర్వైజర్ బి.వి.సుభాషిణి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుభాషిణి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పోషకాహారాన్ని లబ్ధిదారులు మాత్రమే తినాలని తెలిపారు. పౌష్టికాహర లోపం గురించి తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ బీబిజాన్, ఎ.ఎన్.ఎం. జయమ్మ, పంచాయతీలోని అంగన్‌వాడీ కార్యకర్తలు రాధికా దేవీ, వరలక్ష్మి, లక్ష్మి, రత్నకుమారి, సునందన, రమణమ్మ, మిస్సమ్మ, ఆదిలక్ష్మి, తిరుపతమ్మ, ప్రసాదమ్మ, శ్రవంతి, ఇందిర పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి అందజేత

ప్రజాశక్తి-కావలి : కావలి రూరల్ మండలం గౌరవరం ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు మంగళవారం సనాతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరీక్ష సామాగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భారతి, సనాతన ఫౌండేషన్ అధ్యక్షులు బొద్దుకూరి నారాయణరావు, ఉపాధ్యాయులు సంస్థ సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమానికి సహకరించిన దాతలకు ఉపాధ్యాయులు విద్యార్థులు ధన్యవాదాలు తెలిపారు.

పాము కాటుకు మహిళ మృతి

ప్రజాశక్తి-అల్లూరు : మండలంలోని తూర్పు గోగులపల్లి చంద్రశేఖరపురం గ్రామానికి చెందిన పురిణి శేషమ్మ(57) అనే మహిళ మంగళవారం తన ఇంటి వద్ద పరిసరాలు శుభ్రం చేస్తూ ఉండగా కుడిచేతి వేలుకు పాము కాటు వేయడంతో మృతి చెందింది. స్థానికులు హుటాహుటిన అల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తీసుకురాగా చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. ఈ మేరకు ఎస్ఐ శ్రీనివాసులు రెడ్డి కేసు నమోదు చేశారు.

బావిలో దూకి వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం కొండ బిట్రగుంట గ్రామానికి చెందిన రాయి వెంకటేశ్వర్లు మంగళవారం బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తుల వివరాలు మేరకు.. పార్టీల తగాదాలతో మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు.

ఉరేసుకొని టిప్పర్ డ్రైవర్ మృతి

ప్రజాశక్తి-మర్రిపాడు : మండలంలోని చిన్న మాచనూరు (పోలిరెడ్డిపల్లి) సచివాలయం పరిధిలోనుండి కంపసముద్రం హై లెవెల్ కెనాల్ రిజర్వాయర్‌కు మట్టి తోలుతున్న టిప్పర్ డ్రైవర్ చెట్టుకు ఉరేసుకుని మృతి చెందారు. సమాచారాన్ని పోలీసులకు అందించగా ఎస్ఐ శ్రీనివాసులు రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించగా మృతుడు కడప జిల్లా దిరశవంచ గ్రామానికి చెందిన కేశవ (35)గా గుర్తించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. కేసు దర్యాప్తు చేపట్టారు.

డిడిఒ బాధ్యతలు రద్దు

ప్రజాశక్తి-ఉదయగిరి

ఆరోపణలు ఎదుర్కొంటున్న డాక్టర్ రవీంద్రనాథ్ ఠాగూర్ డిడిఒ బాధ్యతలు రద్దు చేసినట్లు వైద్య విధాన పరిషత్ జిల్లా అధికారి రమేష్‌నాథ్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సంతోషంగా ఉన్నప్పుడు ప్రజలకు మెరుగైన సేవలు అందించగలరని వారి సమస్యలను తెలుసుకునేందుకు ప్రభుత్వ వైద్యశాలను తనిఖీ చేశామన్నారు. ప్రతి పేదవాడికి వైద్యం అందించే లక్ష్యంతో డాక్టర్లు సిబ్బంది పనిచేయాలని ఐక్యతతో విధులు బాధ్యతగా విధులు నిర్వహించాలన్నారు. ప్రభుత్వ వైద్యశాలలో ఇద్దరూ గైనకాలజిస్టులు, పంటి, కంటి డాక్టర్లు ఉన్నారు. త్వరలో ఆర్థోపెడిక్ డాక్టర్ నియమిస్తామన్నారు. ప్రస్తుతానికి ప్రభుత్వ చొరవతో సిబ్బంది కొరత తీరిపోయిందన్నారు. గర్భ నిర్ధారణ స్కానింగ్ రక్త పరీక్షలు వైద్యశాలలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మహిళలకు ఆపరేషన్లు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేపడతామన్నారు. ప్రస్తుతం సాధారణ కాన్పులు చేపడుతున్నామన్నారు. వైద్యులు కలిసికట్టుగా పనిచేసే ప్రజలకు మంచి సేవలు అందించాలని సూచించారు. మొదటగా రికార్డులు పరిశీలించి అనంతరం ఫార్మసిస్ట్ విభాగాన్ని పరిశీలించారు. అనంతరం విధులు నిర్వహిస్తున్న వైద్యులను సిబ్బందిని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్లు సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రమేష్‌నాథ్

డాక్టర్ ఠాగూర్‌ను మార్చాలి : సిపిఎం

ప్రజాశక్తి-ఉదయగిరి: ఉదయగిరి పిహెచ్‌సిలో వైద్య సిబ్బందితో విభేదాలతో ఆరోపణలకు గురైన డాక్టర్ రవీంద్రనాథ్ ఠాగూర్ వేరే ప్రాంతానికి మార్చి ఉదయగిరి ప్రజలకు మెరుగైన సేవలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని సిపిఎం మండల కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి ఫర్దిన్ బాషా, ఎంపిటిసి కాకు విజయ మాట్లాడుతూ వెనుకబడిన మెట్ట ప్రాంత ప్రజలకు వైద్యం అందిస్తున్న మహిళా వైద్యులు సిబ్బందిపై అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న వైద్యుని జిల్లా ఉన్నత అధికారులు డిడిఒగా తొలగించడం సంతోషదాయకమన్నారు. వైద్య సిబ్బంది ఇప్పటికైనా ఈ ప్రాంత ప్రజలకు సంపూర్ణ వైద్యం అందించేందుకు ఇక్కడ ఉన్న డాక్టర్ ఠాగూర్ మార్చి ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిఐటి యు గడ్డం నాగేశ్వరరావు, ఐద్వా నాయకురాలు కామాక్షమ్మ, పందిళ్ళ వెంకటేశ్వర్లు, నాయబ్ ఎస్ఎఫ్ఐ నాయకులు కృష్ణ మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

వ్యవసాయరంగంపై ప్రభుత్వం నిర్లక్ష్యం

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

వ్యవసాయ రంగాన్ని, కౌలు రైతుల రంగాన్ని, పరిశ్రమల వంటి తదితర రంగాల్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తూ, కేవలం నవరత్నాల పేరుతో రాష్ట్రాన్ని దివాలా తీయించే చర్యలకు సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కోరుకుంటుందని సిపిఎం నాయకులు విమర్శించారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సిఐటియు సీనియర్ నాయకులు నగేష్ విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాన్య పేద ప్రజానీకానికి రాష్ట్ర బడ్జెట్లో ఒరిగిందేమీ లేదని కేవలం ఇది అంకెల గారడి బడ్జెట్ సమావేశమేనన్నారు. అనంతరం మండల కమిటీ సమావేశంలో ఇందుకూరుపేట మండలంలో ముదివర్తి పాలెం – ముదివర్తి మధ్య చెక్ డ్యాం నిర్మాణానికి ముఖ్యమంత్రి హామీ ఇచ్చి రెండేళ్లు గడుస్తున్న నేటికీ తట్టెడు మట్టి కూడా వేయలేదని తక్షణం నిర్మించాలన్నారు. లేనిపక్షంలో సిఐటియు, సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహిస్తామని తీర్మానించారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు కేంద్రాలను ఇందుకూరుపేట మండలంలో ఏర్పాటు చేయాలని లేని పక్షంలో మండల కార్యాలయాల ముట్టడిని రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా సిఐటియు అధ్యక్షులు టివివి ప్రసాద్, సిపిఎం మండల కార్యదర్శి మైపాటి కోటేశ్వరరావు, సినియర్ సిపిఎం నాయకులు గూడూరు ప్రభాకర్ రెడ్డి, జిల్లా కౌలు రైతుల కమిటీ సభ్యులు వెన్ను వేణు, సిఐటియు మండల అధ్యక్షులు ఎస్.కె.చాన్‌బాషా, కార్యదర్శి మనోహర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టివివి ప్రసాద్

పావని పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-కావలి : కావలి పట్టణం వెంగళరావు నగర్లోని సంయుక్త సేవాసంస్థ కార్యాలయంలో సంస్థ సంరక్షణలో ఉన్న దుర్గా పావని అనే అమ్మాయికి మంగళవారం ఘనంగా పుట్టినరోజు వేడుకను నిర్వహించారు. సంస్థ సభ్యులు గంధం ప్రసన్నాంజనేయులు, ఎమ్‌విఎన్ ప్రసాద్ రావు, సంస్థ అధ్యక్షుడు సురేంద్ర, సంస్థ కార్యాలయంలో బ్యూటీషియన్ శిక్షణ నెర్చుకుంటున్న మహిళలు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది శ్రద్ధగా పనిచేయాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

సచివాలయ సిబ్బంది శ్రద్ధగా పని చేయాలని ఆత్మకూరు మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు కేతా వేణుగోపాల్‌రెడ్డి తెలియజేశారు. మంగళవారం ఆయన మండలంలోని వాసిలీలో ఏర్పాటు చేసిన గడప గడపకు రివ్యూ సమావేశంలో ఆయన మాట్లాడారు. జగనన్న సృష్టించిన ఈ సచివాలయం వ్యవస్థను సిబ్బంది శ్రద్ధగా పనిచేసి గ్రామ ప్రజల సమస్యలను పరిష్కరించి, గ్రామ అభివృద్ధికి తోడ్పడాలని ఆయన కోరారు. అలాగే వాలంటీర్లు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేసి ప్రజల మన్నలను పొందాలని ఆయన సూచించారు. ఎంపిడిఒ సి.శ్రీనివాసులు మాట్లాడుతూ గ్రామంలో మొత్తం 166 సమస్యలు నమోదు కాగా 106 సమస్యలు పరిష్కరించామని, 62 సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని త్వరిత గతిన పూర్తి చేస్తామని ఎంపిడిఒ తెలియజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కిషోర్ బాబు, పంచాయతీ కార్యదర్శి ఆనంద్, విఆర్‌ఓ రమణయ్య, ఉప సర్పంచ్, వైసిపి నాయకులు గిరి నాయుడు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

31న కలెక్టరేట్ ముట్టడి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఎస్‌సి రిజర్వేషన్‌ల వర్గీకరణ లక్ష్య సాధనలో భాగంగా 31న నిర్వహించే కలెక్టరేట్ ముట్టడికి ప్రతిఒక్కరూ కదలిరావాలని ఎంఎస్‌పి జిల్లా కన్వీనర్ పందిటి అంబేద్కర్ మాదిగ పిలుపునిచ్చారు. ఆయన ఆధ్వర్యంలో మాదిగల సంగ్రామ పాదయాత్ర మంగళవారానికి 14వ రోజు ఆత్మకూరు మండలం అల్లీపురం గ్రామంలో మొదలైన సంగ్రామ పాదయాత్ర ఆత్మకూరు పట్టణంలోని చేరుకుంది. ముందుగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంఎస్‌పి సీనియర్ నాయకులు బొద్దుకూరు మహేష్ మాదిగ, సోంపల్లి హజరత్ మాదిగ, మాదిగ మహిళా రాష్ట్ర నాయకులు గంగపట్ల లక్ష్మమ్మమాదిగ, మంద సుజాత మాదిగ, కె.వెంకటనర్సయ్య, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఉపకరణాలు అందజేత

ప్రజాశక్తి-కావలి : ఆద్వి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ముంగమూరు జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో టెన్త్ క్లాస్ విద్యార్థులకు ఎగ్జామ్ కిట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకులు బెజవాడ ప్రసన్నకుమార్ మాట్లాడారు.పాఠశాల ప్రిన్సిపల్, ఆద్వి ఫౌండేషన్ సభ్యులు పవన్, సాయి, షఫీ పాల్గొన్నారు.

అడవుల సంరక్షణపై అవగాహన

ప్రజాశక్తి-మర్రిపాడు : జిల్లా ఫారెస్ట్ అధికారి చంద్రశేఖర్, ఆత్మకూరు ఫారెస్ట్ రేంజ్ అధికారి రామ కొండారెడ్డి ఆదేశానుసారం వెంకటాపురంలో వన్యప్రాణులు, ఎర్ర చందనం సంరక్షణపై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని కృష్ణాపురం సెక్షన్ డిప్యూటీ రేంజ్ అధికారి రాజశేఖర్ గౌడ్ నిర్వహించారు. అటవీ శాఖ అధికారులు మండల వైద్యాధికారి డాక్టర్ గోపీనాథ్ ఆధ్వర్యంలోమెడికల్ క్యాంపు నిర్వహించారు. రోగులను పరీక్షించి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు సాయి కృష్ణ, ఎం.తిరుపతి, స్ట్రైకింగ్ పూర్తి సిబ్బంది కె.నరసింహారావు, ఆర్ వెంకట సుబ్బయ్య, బేస్ క్యాంపు సిబ్బంది గోపాల్, బసవయ్య, రోశయ్య, శ్రీను, కృష్ణయ్య, ఆరోగ్యశాఖ మండల విస్తరణ అధికారి ఎన్ కొండారెడ్డి, హెల్త్ సూపర్వైజర్ ఖాజా జా మొహిద్దిన్ సైదా, అంకిరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

రూ.77 కోట్ల రుణాలు మాఫీ

ప్రజాశక్తి-అల్లూరు

కావలి నియోజకవర్గంలో అక్క, చెల్లెమ్మలకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుండి పలు విడతల్లో రూ.77 కోట్లు రుణాలు మాఫీ చేసినట్లు ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రం స్థానిక టిటిడి కళ్యాణ మండపంలో 3వ విడత ఆసరా సంబరాలు ఏర్పాటు చేయగా ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి సిఎం చిత్రపటానికి మహిళలతో కలిసి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ గత ప్రభుత్వాలు సంక్షేమాన్ని పూర్తిగా దారి తప్పించాయని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర ప్రజలు అన్ని విధాల అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో విరివిగా సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని తెలియజేశారు. మహిళలు ఆర్థిక పురోగతి సాధించాలనే దిశగా రాష్ట్రంలో రూ.20వేల కోట్లు మాఫీ చేసి వారికి అండగా నిలిచారన్నారు. బాబు వస్తే జాబు వస్తుందని అలాగే రైతుల రుణాలు మాఫీ చేస్తామంటూ ప్రచార ఆర్భాటాలు తప్ప గత పాలకులు ప్రజలకు చేసిన మేలేమీ లేదని విమర్శలు గుప్పించారు. చంద్రబాబు నాయుడు ప్రజలను మోసం చేయడం తప్ప ఎక్కడ అభివృద్ధి జరిగిందో చెప్పాలని బహిరంగ సవాల్ విసిరారు. ఈ మధ్యకాలంలో తెలుగుదేశం నాయకులు ఎక్కడా కనిపించలేదని ప్రస్తుతం ఎన్నికల సమయాలలో లేనిపోని రాద్ధాంతాలు సృష్టిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరికీ సొంతింటి కల నెరవేర్చాలనే దృకృథంతో జగనన్న ఇండ్లను ఇచ్చి శరవేగంగా నిర్మాణాలను వేగవంతం చేస్తున్నామన్నారు. అనంతరం మహిళలకు రూ.7కోట్ల 71లక్షల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ దండా కృష్ణారెడ్డి, ఎఎంసి వైస్ ప్రెసిడెంట్ ఊటు శ్రీకాంత్ రెడ్డి, ఎంపిపి దర్శిగుంట శశిరేఖ, జెడ్‌పిటిసి చలంచర్ల వేణమ్మ, డిఆర్‌డిఎ పిడి సాంబశివారెడ్డి, కావలి ఆర్‌డిఓ శీనానాయక్, ఎంపిడిఓ శ్రీదేవి, ఎపిఎం ప్రసాద్ తదితరులున్నారు.


మాట్లాడుతున్న ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

జగనన్న లేఅవుట్‌లో చేతివాటం

- సిపిఎం నాయకులకు మొరపెట్టుకున్న బాధితులు

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

తమకు అన్యాయం జరిగిందంటూ మండలంలోని కొత్తూరు హరిజనవాడకు చెందిన బొచ్చు అమృత, బొచ్చు బాలయ్యలు తమకు న్యాయం చేయాలంటూ మంగళవారం సిపిఎం నేతలకు మొరపెట్టుకున్నారు. తమకు సంబంధించిన ఇందుకూరుపేట బిట్టు2 కొత్తూరు జగనన్న లేఅవుట్‌లోని ప్లాట్ నెంబర్ 104 లో కొత్తూరు గ్రామానికి చెందిన ఓ వైసిపి నేత ఇల్లు కట్టిస్తానని చెప్పి తమ దగ్గర నుండి మొదటి బిల్లుగా రూ.35 వేలు నగదు, 40 సిమెంటు బస్తాలను, 20 బార్ల కమ్మిని, ఇసుకను తీసుకున్నారని తెలిపారు. నిర్మాణం నాసిరకంగా ఉందని తాము ప్రశ్నించడంతో ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో తాము ఇకపై ఇంటిని నిర్మించబోయేది లేదని నిర్ధాక్షణంగా ఆపేశారని సదరు బాధితులు వాపోయారు. బాధితులు పలుమార్లు అధికారుల చుట్టూ తిరగకగా తమకు ఏమి సంబంధం లేదని ఇకపై మీరు పనులు మొదలు పెడితే తాము బిల్లు సాంక్షన్ చేస్తామని తెలిపారన్నారు. తమకు రావాల్సిన నగదును ఇప్పించాలని సదరు బాధితుడు సిపిఎం నాయకులతో మొరపెట్టుకున్నాడు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు సదరు బాధితులకు భరోసాని కల్పించి తొందర్లోనే తమకు రావాల్సిన నగదును ఇప్పిస్తామని హామీనిచ్చారు.


సిపిఎం నాయకులకు
తమ గోడు వెళ్లబోసుకుంటున్న బాధితులు

బయోగ్యాస్ వివరాలు తెలపాలి


ప్రజాశక్తి-నెల్లూరు



మధ్యప్రదేశ్, ఆంధ్ర ప్రదేశ్‌లో అత్యధిక బయోగ్యాస్ ప్లాంట్లు ఉన్నాయన్న విషయం వాస్తవమేనా పూర్తి వివరాలు తెలియజేయాలని మంగళవారం పార్లమెంట్‌లో రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ప్రశ్నించారు. మరిన్ని బయోగ్యాస్ ప్లాంట్‌లు ఏర్పాటు చేయడానికి మంత్రిత్వ శాఖ చేపట్టవలసిన పథకాల వివరాలు, ముఖ్యంగా గ్రామీణ ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి వివరాలు తెలపాలన్నారు.

లిఖిత్‌రెడ్డికి డాక్టరేట్

ప్రజాశక్తి-కావలి



స్థానిక పి.బి.ఆర్.విట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూని కేషన్స్ విభాగం అధ్యాపకుడిగా పని చేస్తున్న దొడ్ల లిఖిత్ రెడ్డికి అనంతపురం జె.ఎన్.టి. యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. లిఖిత్ రెడ్డి ప్రొఫెసర్ ఎస్. వి. సుబ్బారావు పర్యవేక్షణలో "ఎన్‌హెన్స్‌మెంట్ ఆఫ్ రాడార్ సిగ్నల్ డిటెక్షన్ యూసింగ్ పల్స్ కంప్రెషన్ టెక్నిక్" అనే అంశంపై అధ్యయనం చేశారు. అందువల్ల ఆయనకు డాక్టరేట్ లభించింది. విట్స్ కళాశాలలో సహా అధ్యాపకులం దరూ లిఖిత్ రెడ్డిని ఘనంగా అభినందించారు. కాగా లిఖిత్ విశ్వోదయ విద్యా సంస్థల వ్యవస్థాప కుడు, కావలి తథాగతుడు దొడ్ల రామచంద్రారెడ్డి (విద్యాధర్ కుమార్‌రెడ్డి కుమారుడు) మనవడు కావడం విశేషం.

సిమెంట్ బెంచ్ బహూకరణ

ప్రజాశక్తి-కావలి

కావలి గ్రీన్ హ్యాండ్స్ సంస్థ సభ్యురాలు(గుప్త దాత) సహకారంతో కావలి ఆర్.టి.సి. బస్టాండ్ ఆవరణంలో ఒక సిమెంట్ బెంచీ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకురాలు వేమూరి గాయత్రి మాట్లాడుతూ ప్రయాణికుల సౌకర్యార్థం పలు బస్టాండ్‌లలో సభ్యుల సహకారంతో సిమెంట్ బెంచ్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు మాట్లాడారు. కార్యక్రమంలో వేమూరి శ్రీలేఖ, పబ్బిశెట్టి శార్వాణి, మట్టా రజిని, ఇన్నమూరి శ్రీలత, ఆర్‌టిసి అధికారులు రవి ప్రకాష్, జనార్థన్ పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి-కావలి : కడప జిల్లా పశు సంవర్ధక శాఖ సంచాలకులు డాక్టర్ అచ్చన్న మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని మంగళవారం డిఎకు ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు దమ్ము దర్గాబాబు ఆరుమూరు సుబ్రమణ్యం వినతి పత్రం అందజేశారు. వైసిపి అధికారంలోకి వచ్చాక దళిత అధికారులపై దాడులు పెరిగాయని అన్నమయ్య జిల్లా రామపురం మండలంలో 40వ జాతీయ రహదారిపై ఆచ్చన్న మృతదేహం కుళ్లిన స్థితిలో ఉండటం దయనీయమన్నారు. తోటి సహ ఉద్యోగులు చిత్రహింసలకు గురి చేసి, అత్యంత దారుణంగా చంపివేశారని ఫిర్యాదు చేసిన, పట్టించుకోని అధికారులు నిర్లక్ష్య వైఖరి అచ్చన్న మృతికి దారితీసిందన్నారు. రాష్ట్రంలో దళితులపై దమన కాండ హద్దు లేకుండా సాగుతుందని తెలిపారు. దళితులపై హత్యలు వారిపై నేరాలు దాడులు దౌర్జన్యాలు అక్రమ కేసులు బనాయింపు, వేదింపులు భరించలేక భాదితులు బలవన్మరణంకు పాల్పడుతున్నారు. తీవ్ర మానసిక క్షోభతో ప్రాణాలు విడుస్తున్నారు. వైసిపి పాలనలో దళితులపై జరుగుతున్న అకృత్యాలు పరాకాష్టకు చేరుకున్నాయి. డాక్టర్ అచ్చన్న మతికి సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, డాక్టర్ మృతికి కారకులైన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు.

వరికుంటపాడులో విద్యుత్ కోత

ప్రజాశక్తి-వరికుంటపాడు

మండలంలోని విరువూరు, ధర్మవరం, కొండాయపాలెం, తొడుగుపల్లి, తూర్పుపాలెం, కృష్ణంరాజు పల్లి పలు గ్రామాలలో అర్ధాంతరంగా కరెంటు కోతల వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మరికొద్ది రోజుల్లో 10వ తరగతి విద్యార్థులకు పరీక్షలు దగ్గరలో ఉన్నాయి. ఎటువంటి సమాచారం లేకుండా కరెంటు కోతతో విద్యార్థులకు ఇబ్బందికరంగా ఉంటుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యార్థుల పరీక్షలను దృష్టిలో పెట్టుకొని సంబంధిత విద్యుత్ అధికారులు విద్యుత్ కోతలపై తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఒడిదుడుకులను ఎదుర్కొంటాం..

ప్రజాశక్తి-ఉదయగిరి

తన జీవితం ప్రజాసేవకే అంకితమని, ఎన్ని రాజకీయంగా ఒడిదుడుకులు ఎదురైనా ఉదయగిరి నియోజకవర్గ ప్రజలకు తన జీవితాన్ని అంకితం చేస్తానని ఎంఎల్ఎ మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఆయన అతిథి భవనంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఆకలి మనిషికి తమ భోజనం సగంపెట్టి వారి ముఖంలో ఆనందం చూసేవారమని నియోజకవర్గం ఉదయగిరిలో జరిగిన అభివృద్ధిని ప్రజలు గుర్తిస్తారని రెండుసార్లు రాజీనామా చేసిన కుటుంబీకులమని ఇవన్నీ గుర్తించక ఇలా చేయడం దారుణమన్నారు. అనంతరం ఇటీవల జరిగిన రాజకీయ పరిణామాలపై నాయకులు అభిమానులతో చర్చించారు. కార్యక్రమంలో నాయకులు అభిమానులు పాల్గొన్నారు.

రైల్వే గేట్లను పరిశీలించిన ఎడిఎన్

ప్రజాశక్తి-బిట్రగుంట : విజయవాడ డివిజన్ బిట్రగుంట రైల్వే స్టేషన్ పరిధిలో ఉన్న ఎల్‌సి 141 రైల్వే గేట్లను రైల్వే ఎడిఎన్ అపూర్వ విశిష్ట, తహశీల్దార్ లక్ష్మీనారాయణతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ 2027 సంవత్సరం నాటికి ఒక రైల్వే ఎల్‌సి గేటు కూడా ఉండకూడదని రైల్వే ప్రతిపాదనకు సిద్ధమైందన్నారు. కార్యక్రమంలో రైల్వే అధికారులు, విఆర్‌ఓ కిరణ్, తదితరులున్నారు.

కుట్టుమిషన్ అందజేత

ప్రజాశక్తి-ఉదయగిరి

విద్యార్థినులకు కుట్టు మిషన్ బహుకరించిన పూర్వ విద్యార్థులు ఎఎన్ఎంకు ప్రధానోపాధ్యాయులు తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ బృందం వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల అప్పసముద్రం బాలికలు ఎక్కువగా విద్యను అభ్యసిస్తున్న తరుణంలో పాఠశాల విద్యార్థినుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని కుట్టుమిషన్లను సమకూర్చుకోవడానికి చవటపల్లి పూర్వ విద్యార్థులు చేజర్ల.వెంకట్రామిరెడ్డి, రామిరెడ్డి జయచంద్రా రెడ్డి రూ.20వేలు అందజేశారు. రూ.6వేలు అప్పసముద్రం ఏఎన్ఎం పెట్లూరు పద్మావతి ఈ బృహత్తర కార్యక్రమానికి సహకారం అందించారు. పాఠశాల శ్రేయోభిలాషి సిహెచ్.చిన్నయ్య, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు తల్లిదండ్రుల కమిటీ, విద్యార్థుల తరపున వారు ప్రత్యేక అభినందనలు తెలిపారు.